# సాయి దర్శన్

## 108 పుష్పాలమాల

## 1వ పుష్పము

1 ఓం శ్రీ సాయి - సత్య సాయిబాబాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

ఓంకారము - ప్రణవనాదము - ఆది శబ్దము - పరబ్రహ్మ స్వరూపము - అవినాశి "ఓమిత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానం । భూతం భవ ద్భవిష్య చితి । సర్వమోంకార ఏవ । యచ్చాన్య త్రికాలాతీతం । తదప్యోంకార ఏవ" అని మాండూక్యోపనిషత్తు, దృష్టికి గనబడు సమస్త పదార్థములును, ఓంకారమే, ఓంకారము నాశరహితమగు బ్రహ్మ స్వరూపము. భూత, భవిష్య ద్వర్తమానము అన్నియును ఓంకారమే. త్రికాలములను దాటి యుండునది. అనగా అవ్యక్తమును, ప్రకృతియును ఓంకారమే. అది బ్రహ్మ శరీరము. అందలి జ్యోతిస్సు బ్రహ్మము (సాయి పరమేశ్వరుడు). సకల శబ్దములును, ఓంకారము నుండియే పుట్టినవి. "అవంతి బ్రహ్మబుద్ధ్యాద్రష్టః ద్రష్టౄనితి ఓమ్" ఓంకార నిర్వచనం. అనగా బ్రహ్మ బుద్ధితో, తన్ను తెలిసికొన్న వారిని, జన్మ జర మృత్యు రూప మగు, భయంకర సంసారము నుండి, రక్షించునది కావున "ఓమ్" (శ్రీ శంకరానందులు). స్వామి, ఇప్పడు సాకార పరమాత్మ, స్వామివారికి ఓంకారము సంకేతము. శ్రీ సాయి పరమేశ్వరుని పరిపూర్ణ వైభవమును సూచించును. ఋగ్యజు సామ వేదములను 'శ్రీ' యనబడును. అట్టి శ్రీ గ వారల బ్రహ్మాదులు - స్వామి దివ్య నామములను పఠించి, పూజ చేయునపుడు ముందు "ఓం శ్రీ" అనిన తర్వాత, దివ్య నామమును పఠించవలెను "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" (తై.ఉ.). సత్య శబ్దము పరమేశ్వరునికే చెందుతుంది. సాయి అంటే తల్లి, బాబా అంటే తండ్రి. "నమః" అంటే "ఇది నాది కాదు" అను భావముతో దశేంద్రియ కర్మఫలమును సాయి పరమేశ్వరు నకు అర్పణ చేయుచున్నాను. ప్రణవ స్వరూపుడును, సకల వైభవ సంపన్నుడును, సత్యస్వరూపుడును, తల్లియు, తండ్రియు అయిన సాయి పరమేశ్వరునకు, రెండు హస్తములు జోడించి నమస్కారము చేయుచున్నాను.

2) కవీశ్వరుడు - స్వామి ప్రతిజ్ఞ

ప॥ అడవిలో నున్నను । ఆకాశముననున్న,
పట్టణమునున్న । పల్లెనున్న,
గట్టుమీదను నున్న । నట్టేట నున్నను
మరువడు నీ సాయి । మదిలోన నెపుడు ॥

నేటి స్వామి దివ్యవాణి. అభయ హస్తమే, స్వామి ప్రతిజ్ఞ తెలియజేస్తుంది.

3) సకలతత్త్వ బోధకుడు - (సత్సంగము)

"గులకరాళ్ళు లభించడం చాలా తేలిక, సులభం, వజ్రాలు లభించడం దుర్లభం. అటులనే సత్సంగం లభించడం చాలా కష్టము, చెడ్డవారి పొందు లభించడం చాలా తేలిక. కలుషితమైన బొగ్గుకు, నిప్పుతో సాంగత్య మేర్పడుట వలన, దానిలోని కలుషితము హరించి పోయి, అది కూడా నిప్పుగా మారిపోతుంది. ఇనుమును గాలిలో వుంచితే తుప్పపడుతుంది. ఈ యినుముతో సాంగత్యము గలిగిన నిప్పు కూడా సుత్తి దెబ్బలు తినవలసి వస్తుంది. అధోగతికి దారి సులభము. కుండెడు చక్కని క్షీరములో ఒక చిన్న విషబిందువు పడినచో క్షీరమంతా నిరుపయోగంగా మారిపోతుంది. దుస్సాంగత్యము వలన పూర్వపు సద్గుణాలు నశిస్తాయి. మంచి సద్గుణాలు అలవడటం చాలా కష్టము. చెడు నడతలు అలవడటం చాలా సులభం. ఒక చిన్న రాతిని ఎత్తైన కొండమీదకు

మోసికొనిపోవడం చాలా కష్టము. పెద్ద రాతిబండను కొండనుండి తేలికగా నెట్టవచ్చును. అదేవిధముగా సద్గతిని చెందుట చాలా కష్టము. అధోగతికి పోవుట చాలా సులభము అనేది స్వామి బోధ. "కష్టేఫలే" అని స్వామి అందరును ఎంత కష్టమైనా మంచివారి స్నేహము సంపాదించి, మంచివారుగా మారాలి అనేది స్వామి శాసనము. "సత్సంగత్వమే నిస్సంగత్వానికి దారి తీస్తుంది" అన్నారు స్వామి.

4) సర్వజ్ఞుడు

సత్సంగము వలన ఫలితములను గురించి శ్రీ శంకరులు ఏమి అన్నారు?

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం । నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్వం । నిశ్చలతత్వే జీవన్ముక్తి ॥

అని భజగోవింద శ్లోకములలో శ్రీ శంకరులు చెప్పారు. సజ్జనులతో కలయిక (స్నేహము) దొరికెనా, కళత్రాదుల యందలి ప్రతిబంధము తొలగును. ఈ ప్రతి బంధము వీడెనా మోహము వీడును. మోహము వీడెనా శుద్ధ జ్ఞానము లభించును. అది అబ్బెనా, జీవన్ముక్తి కలుగును - ఈ మోహమే సంసారమునకు మూల కారణము - మోహనాశనమే మోక్షమన్నారు స్వామి.అట్లే పద్మపాదుల వారు (శ్రీ శంకరుల శిష్యుడు) అన్నారు.

శ్లో॥ కాతే కాన్తా ధనగతచింత । వాతుల కిం తవ నాస్తి నియన్తా।
త్రిజగతి సజ్జన సంగతిరేకా । భవతి భవార్ణవ తరణే నౌకా ॥

ఓయి వెర్రివాడా! నీకీ ధనగతచింత ఎట్లు హృద్యమైనదోయీ, మరియు నిన్నిట్టి మోహతిమిరము నుండి పైకి తీసి సన్మార్గము చూపి, ఆయా కట్టుబాట్లనెల్లా నియోగించు వాడు లేకుండెనా? ఓయీ తృష్ణాపీడితుడా, నీకీ భవ సాగర సంతరణము విషయమై, సజ్జన సహకారము (సత్సంగము) తప్ప, ముల్లోకములు గాలించినను, వేరొండు గానరాదు.

వాల్మీకి అసలు పేరు రత్నాకరుడు. అతడు బాటసారులను హింసించి, అపహరించిన ధనముతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. రత్నాకరుడు సత్పురుషుల (సప్తఋషుల) సత్సంగము వలన, తన దుర్భావములను, దుశ్చింత లను దూరము చేసికొని ఆదికవి అయినాడు, వాల్మీకిగా మారాడు. సత్పురుషులే, అతనిని శ్లోకదాత వాల్మీకి, లోక దాత భగవంతుడు అని కీర్తించారు.

5) ప్రేమ స్వరూపుడు

వారి ప్రేమ వాక్కులు, అమృత తుల్యములు. స్వామి అంటారు, "యావత్ మానవ కోటిని నా దివ్య ప్రబోధము లచే, దైవోపముఖులుగా మార్చెడి మానసిక పరివర్తనమును, ఉత్తేజమును, సంచలనమును, నా ప్రేమ ప్రభావ ముతో కలుగజేసి వారినందరిని లాలించి, పాలించి నాలో ఐక్యము చేసికోవటమే నా లక్ష్యము. మానవత్వము నుండి మాధవత్వమునకు దారి చూపుటయే నా సంకల్పము."

దివ్యలీల : అట్టి ప్రేమ స్వరూపుడు కనుకనే పువ్వు మొగ్గ నుండి వజ్రమును సృష్టించి గ్రంథకర్తయును, భక్తు డును అయిన శ్రీ మర్ఫెటుకు బహూకరించారు. దీనివలన సృష్టికర్త అయినారు స్వామి.

దివ్యచికిత్స : రాధ కడుపులో యున్న కేన్సరు గడ్డకు, దివ్య చికిత్స చేసి ఆమె అక్క సీతామహాలక్ష్మి ప్రార్థనలను అందుకున్నారు. రెండవ ఆపరేషను జరిగింది, డాక్టర్లు లాభం లేదన్నారు. కానీ స్వామి అనుగ్రహముచే డాక్టర్లు ఆశ్చర్యపడిపోతుండగా రాధకు సంపూర్ణ ఆరోగ్యము కలిగింది. అదే స్వామి ఆశీర్వాదము - అనుగ్రహము.

6)   సకల జనప్రియుడు : భక్తుడు (జాన్ హిస్లాప్) :

జాన్ హిస్లాప్ స్వామి భక్తుడు, అమెరికా దేశస్తుడు. అనేక దేశాలు సత్యాన్వేషణ కొరకు తిరిగాడు. తాను జ్ఞాని అనుకున్నాడు. కానీ స్వామి "నీవు భక్తుడవు మాత్రమే" అన్నారు. హిస్లాప్ అనుభూతి ఇట్లాయున్నది. "నేను స్వామి తో సంభాషిస్తూ, హే భగవాన్! మీరు నరరూపంలో అవతరించగా, మాకు కూడా మానవ రూపము ప్రసాదించి, మీ దర్శన, స్పర్శన,సంభాషణ భాగ్యం అనుగ్రహించారు. ఎన్నో జన్మలు తపము చేసి, మీ అనుగ్రహం పొందడం

యీ కాలంలో సంభవించగా ఇది ఎంతో పవిత్రకాలం. మహోత్కృష్టమైన కాలం కాకపోతుందా స్వామీ?

భగవంతుని గురువుగా స్వీకరించెడి భాగ్యంయీ కాలంలో మాకు కలిగింది. స్వామి ఒక మానవుడుగా అవతరించడానికి ఇది ఉత్తమోత్తమ సమయము గదా! (స్వామి అన్నారు "అవును ఉత్తమ సమయమిది"). స్వామి ఆదేశించిన పని చేయడమే మన విధి. సేవయే సాధన. మీ ధర్మస్థాన ఉద్యమములో మమ్ముల సేవకులుగా

స్వీకరించండి. ఎంత మంచికాలము".

7)   స్తుతి ప్రియుడు - నామ సంకీర్తనం :

స్వామి అన్నారు "అంతా భజనలలో పాల్గొనాలి. నోరు దేవుడు యిచ్చినదెందుకు? పరమాత్మ నామమును

నాలుక మీద నాట్యము చేయించేటందులకే! జీవితమనే ఎడారిలో, మానవుని దాహము తీర్చగలది ఒక్క

నామము మాత్రమే. "సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనమ్." దానిలో ఆసక్తి కలిగిన వారు అందరూ చేరే

అవకాశము కలిగించాలి. అనుకూలము కలిగిన స్థలమందు, కాలమందు, భజనలను ఆనందముగా చేయండి. మీకు ఆత్మానందము అందించే ఏ భగవన్నామమైనా సరే, శ్రావ్యముగా, హృదయములోని ఆవేదనతో, ఉత్సాహముతో పాడండి. ప్రణవోచ్ఛారణముతో (మూడుసార్లు) భజనను మొదలుపెట్టి దానితోనే ముక్తాయ పరచండి. మీరు ఏ నామముతో భజనలు చేసినా నాకే చెందుతుంది. అన్ని నామములు, రూపములు నావేగా". భజన మొదట

విఘ్నేశ్వరుని ప్రార్థనతో ప్రారంభించాలి.

దివ్యభజన:

సింధురవదనా బాలగజానన
ప్రణవాకారా హే, శివనందన ॥ సిం ॥
విద్యాబుద్ధి సిద్ధిప్రదాయక
మంగళకారక హే శుభదాయక
శ్రీ సత్యసాయి హే గణనాయక ॥ సిం ॥

8)   వేదాంతవేద్యుడు : ఈశావాశ్యోపనిషత్తు

వేదపండితులు స్వామిని వేదవేద్యులందురు. అంటే ఒక్క వేదము లేక వేదాంతము చేతనే పొందబడువాడు. అవా

జ్ఞానసగోచరుడు, వాక్కుకుగాని, మనస్సుకు గాని, బుద్ధికి గాని అందనివాడు. శాస్త్రములకు అందడు సాయి

పరమేశ్వరుడు. అందరి హృదయములలో వుండెడి హృదయేశ్వరుడు - ఆత్మస్వరూపుడు.

మం॥   ఈశావాస్య మిదగ్ం సర్వం । యత్కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా । మా గృధః కస్య స్విద్ధనమ్ ॥1॥

ఈ ప్రపంచమంతయు మిథ్య. అనగా మాటిమాటికి మార్పుచెందునది. పరమార్థ స్వరూపుడును, ఆత్మస్వరూపుడు నగు నాకంటే (సాయిపరమేశ్వరుని కంటే) యితరము లేదు. కావున ఈ కల్పిత ప్రపంచమును విడిచిపెట్టుము -

ఇదియే సర్వసన్న్యాసము. ఈ సన్న్యాసమును అవలంభించి, నిన్ను నీవు రక్షించుకొనుము. సత్యమైన ఆత్మకంటే మరియొక దానిని ఆశింపకుము. ఈ జగత్తు అంతా ఈశ్వరాధీనమై యుంటే, నీవు నాది యని దేనిని ఆశించ గలవు? వున్న దానితో తృప్తిపడుము.ఆత్మ అకర్త, అభోక్త, సర్వగతుడు నిత్యశుద్ధముక్త స్వభావుడు. ఆత్మకంటే సాధ్య సాధన రూపమగు వస్త్వంతరము లేదని ఈ మంత్రము ఉపదేశించుచున్నది. గాంధీ మహాత్ములు ఈ మంత్ర రాజమును నిత్యము పారాయణం చేసేవారు.

**ఓం తత్సత్**